కథ

# మేరా భారత్ మహాన్

రైలు వేగాన్నందుకుంది.

విజయవాడ పోదామని ఒంగోల్లో ఎక్కానా రైలుని.

ఆరోజెందుకో రష్‌గా లేని కారణంగా కూర్చోవడానికి సీటు దొరికింది.


రైలు ఎక్కే ముందు కొన్న వీక్లీని చూస్తూ కూర్చున్నాను. నాకు కొంచెం దూరంలో కూర్చున్న వారి నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

''నేను రాజకీయ నాయకుణ్ణి, మీరు సంఘ సేవకులు, ఆవిడేమో మహిళాభ్యుదయం కోసం కంకణం కట్టుకున్నమహిళ, ఇతనేమో అభ్యుదయ భావాలున్న విద్యార్థి నాయకుడు. ఇలా మనమందరం కలుసుకోవడం చాలా ఆనందంగా వుంది'' అన్నాడు ఖద్దరు బట్టలు ధరించిన ఓ మధ్య వయస్కుడు.

''నిజమే సుమండీ, మనమంతా అంతో యింతో ఏదో రూపంలో ప్రజాసేవ చేస్తున్న వాళ్ళమే. నిస్వార్థంగా ఈరోజుల్లో ఎవరు చెప్పండి యిలా చేసేది. ఎవరికి వారే ఎంత సంపాదించుకుందామా, ఎలా సంపాదించుకుందామా అని ఆలోచించే వాళ్ళేగాని ప్రజలకోసం ఆలోచించే వాళ్ళు లేరు'' అన్నాడు లాల్చీ పైజమా వేసుకున్న సోషల్ వర్కర్.

అతనికో నలభై ఏళ్ళుంటాయి.

''బాగా చెప్పారు. అందరూ ఆలోచిస్తే ఈ దేశం యిలా ఎందుకుంటుంది చెప్పండి. అంతెందుకు మా స్త్రీలను చూడండి ఎంత వెనుకబడి వున్నారో. వాళ్ళ అభివృద్ధికి పాటు పడేవారెవరూ కన్పించరు. నేను, నా భర్త, నా పిల్లలు అనుకునే వారేగాని తోటి స్త్రీ కష్టాల్లో వుంది ఆదుకుందామనుకునే ఆడాళ్ళే వుండరు. ఒకవేళ వున్నా మగాళ్ళు వప్పుకోరు. అందుకే నా ఆశయాలకు అడ్డుపడుతున్నాడని నా భర్తకు విడాకులిచ్చేసాను.'' అంది ధగధగ మెరిసే ఎరుపురంగు సిల్కుచీర, అదే రంగు బ్లౌజు వేసుకుని, ముఖానికి దట్టంగా పౌడరు అద్దుకుని, పెదాలకు లిప్‌స్టిక్ పూసుకుని అందంగా కన్పించడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నట్లున్న మహిళా నాయకురాలు.



''నిజంగా మిమ్మల్ని అభినందించవలసిందే. మీరిలా సంసారాన్ని కూడా వదులుకుని మహిళాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారంటే గొప్ప విషయమే. నేనూ అంతే, మా విద్యార్థుల అభివృద్ధి కోసం నా చదువును కూడా త్యాగం చేసి వాళ్ళ సమస్యల పరిష్కారానికే ఎక్కువ కృషి చేస్తుంటాను'' అన్నాడు విద్యార్థి నాయకుడు.

వాళ్ళందరి మాటలు విన్న తర్వాత యిదేదో యింట్రస్టింగ్‌గా వుందే అనుకుని వీక్లీ చూస్తూనే వాళ్ళ మాటల్ని ఆలకిస్తున్నాను.

అంతలో చీరాల స్టేషనొచ్చింది.

టీలమ్మే వాడొస్తే నేనో టీ తీసుకున్నాను.

వాళ్ళూ తీసుకున్నారు.

వాళ్ళంతా అలా మాట్లాడుకోవడం నాకు కొంచెం ఆనందంగానే వుంది. ఎందుకంటే సమస్యలకు పరిష్కారం ఆలోచించకపోయినా కనీసం సమస్యల గురించయినా చర్చిస్తున్నారు. ముందు యిలాంటి చైతన్యం ప్రజల్లో వస్తే సొల్యూషన్ దానంతటదే దొరుకుతుంది.

ట్రెయిన్ కదిలింది.

వాళ్ళు మళ్ళీ కబుర్లలో పడ్డారు.

''చూసారా పేపర్లో ఏం వ్రాసారో. రైల్వేలకు

కట్టా రాంబాబు

నష్టాలొస్తున్నాయట. ఈమధ్య ఏక్సిడెంట్లు కూడా ఎక్కువగానే జరుగుతున్నాయి కదా ఖర్చులు కూడా బాగా పెరుగుతున్నట్లున్నాయి'' అన్నాడు సోషల్ వర్కర్.

''నష్టాలు రావటండీ...టి.టి.యి లు చూడండి పబ్లిగ్గానే బెర్తుల్ని అమ్మేసుకుంటున్నారు. పైస్థాయి నుంచి క్రిందిస్థాయి వరకు అంతా లంచగొండులే మరి. ప్రతీచోటా అవినీతి పెరిగిపోయింది. రైల్వే వ్యవస్థే యిలా వుంటే యింక దేశం ఎలా బాగుపడుతుంది చెప్పండి. దేశంలో అవినీతిని అంతమొందించడానికి జాతీయస్థాయిలో విద్యార్థి సంఘాలన్నీ పోరాడాలని నిర్ణయించుకున్నాయి'' అన్నాడు విద్యార్థి నాయకుడు.

''చాలా మంచి ఆలోచన. యిలాంటి ప్రయత్నం అన్ని వర్గాల నుంచి వచ్చినప్పుడు దేశంలోని సమస్యలు పరిష్కరించబడతాయి. లేకపోతే ఎవరికి వారు నాకెందుకులే అనుకుంటే దేశం యింకా సమస్యల మయమైపోతుంది'' అన్నాడు రాజకీయ నాయకుడు.

ట్రెయిను బాపట్ల దాటేసి చాలా సేపయింది.

తెనాలి రాబోతుంది.

అంతలో కంపార్టుమెంటులో వున్న చెత్తనంతా తుడుస్తూ మా ముందుకొచ్చాడు ఓ కుంటి కుర్రాడు.

నేనో రూపాయి యిచ్చాను.

ఆ నల్గురు కూర్చున్న సీట్ల క్రింద శనకాయ తొక్కలు, అరటి తొక్కలు వున్నాయి. వాటిని శుభ్రంగా తుడిచి వాళ్ళ ముందు చెయ్యి చాపాడు.

''పోరా కుంటి వెధవా! నిన్నెవరు తుడవమన్నార్రా. నీలాటి అడుక్కుతినే వెధవలున్నారు కాబట్టే మన దేశం కూడా అడుక్కుతింటుంది'' అన్నాడు సోషల్ వర్కర్.

''బాగా చెప్పారు. వీళ్ళంతా దొంగ వెధవలండి. మనం చూడకపోతే ఏ పెట్టో, బేగ్గో పట్టుకుపోతారు. అడుక్కోవడం వీళ్ళకు హాబీ అయిపోయింది'' అన్నాడు రాజకీయ నాయకుడు.

వాళ్ళ మాటలకు నా మనస్సు చివుక్కుమంది.

వాడికీ బాధ కల్గించినట్లున్నాయి. ముఖం అదోలా పెట్టాడు.

కష్టం చేసి డబ్బులడుగుతున్నాడు. ఉంటే యివ్వాలి లేకపోతే పొమ్మనాలి. అంతంత మాటలని వాడిని బాధపెట్టడం ఎందుకు. వాడేం డిమాండ్ చెయ్యడం లేదుగా.

అయితే వాడు మాత్రం వూరుకోలేదు వాళ్ళకి గట్టిగానే సమాధానం చెప్పాడు.

''సూడండి బాబూ! నేనసుమంటోన్ని కాదు. రెక్కల కట్టం మీద బతికేటోణ్ణి. దొంగతనం సేసేటట్టయితే ఈ సెండాలపు పని సెయ్యాల్సిన పనేంవుంది. నోరుందని మాటలనెయ్యకండి పైసలుంటే యియ్యండి లేదా నేనే పోతాను. పతీవోడూ దానం సేసేటట్టయితే నేను రోజూ అడుక్కోవడ మెందుకు'' అనేసి దేక్కుంటూ ముందుకెళ్ళిపోయాడు.

నాకప్పటివరకు వాళ్ళ మీద వున్న సదభిప్రాయం సడలిపోయింది.

వీళ్ళంతా చేసేది తక్కువైనా స్వంత డబ్బా కొట్టుకునే వాళ్ళలా వున్నారనిపించింది.

అంతలో కంపార్ట్‌మెంట్లో కలకలం బయలుదేరింది.

ఏమిటా అని చూస్తే టి.టి.యి టిక్కెట్లు చెక్ చేసుకుంటూ వస్తున్నాడు. టిక్కెట్లు లేని వాళ్ళం దర్నీ పెనాల్టీ కట్టమంటున్నాడు. కొంతమంద యితే పదో, పాతికో చేతిలో పెట్టి తప్పించుకుందామని చూస్తున్నారు.

ఎవరి మాటా వినడం లేదా టి.టి.యి.

పెనాల్టీ కట్టాల్సిందేనని లేకపోతే వచ్చే స్టేషన్లో పోలీసులకప్పజెపుతానని చెడామడా తిడుతున్నాడు.

అతని నిజాయితీకి నాకు ముచ్చటేసింది.

ఆ హడావిడికి ఈ ముగ్గురిలోనూ కంగారు బయలుదేరింది.

రాజకీయ నాయకుడు, సోషల్ వర్కరు గబగబా అక్కడ నుంచి కదిలి చెరో టాయిలెట్లోను దూరిపోయారు. విద్యార్థి నాయకుడు పై బెర్తు మీదకెక్కి నిద్రపోతున్నట్లు పడుకుండిపోయాడు. మహిళా మండలి లీడరు మాత్రం హేండు బేగ్‌లో నుంచి వీక్లీ తీసి బయటి ప్రపంచంతో సంబంధం లేనట్లు పేజీలు తిరగేస్తోంది.

టి.టి.యి నన్నడిగిన వెంటనే టికెట్ తీసి చూపించాను.

టికెట్టివ్వమని ఆమెనడిగాడు.

ఆమె ఒక చిరునవ్వు నవ్వి-''మా వారి దగ్గరుండిపోయిందండి. ఆయన బాపట్లలో వాటర్ బాటిలు కొందామని దిగారు. ఈలోగా ట్రెయిను కదిలిపోయింది. 'పక్క కంపార్టుమెంట్లో ఎక్కే సారు'' అంది.

టిటియి ఏమీ మాట్లాడలేదు.

ఇంతలో తెనాలి స్టేషను రావడంతో పైబెర్తు మీద పడుకున్న విద్యార్థి నాయకుణ్ణి అడక్కుండానే, టికెట్లు లేని వాళ్ళని తీసుకుని టి.టి.యి దిగిపోయాడు. ఇక్కడ కొంతమంది దిగారు. మరికొంత మంది ఎక్కారు. టాయిలెట్లో దూరిన యిద్దరూ వచ్చి తమ సీట్లలో కూర్చున్నారు. బెర్త్‌మీద పడుకున్న విద్యార్థి నాయకుడు కూడా బెర్త్ దిగి తన సీట్లో కూర్చున్నాడు.

వాళ్ళెందుకలా ప్రవర్తించారో ఎవరికి వారే ప్రక్కవారికి తెలియదన్నట్లు మాటల్లో పడ్డారు.

దేశం గురించి రైల్వేలకు వచ్చే నష్టాల గురించి చర్చిస్తున్నారు.

రైల్వేలకు నష్టాలెందుకు వస్తున్నాయో వాళ్ళు మాట్లాడుతుంటే నాకు గురివింద గింజ సామెత గుర్తుకొచ్చింది.

ఇంతలో మా ట్రెయిను ప్రక్కనే మరొక ట్రెయిను నెమ్మదిగా వచ్చి ఆగింది. రైలు యింజను మీద అతికించివున్న 'మేరా భారత్ మహాన్' అన్న పోస్టరు చూసి నాలో నేను నవ్వుకున్నాను. ★

